# జమ్మి

ముక్తా! ముక్తా! అంటూ రెండుమూడు తడవలు పిల్చినా, భార్య సమాధానం రాకపోయేసరికి ఆత్రంగా బెడ్‌రూంలో ప్రవేశించి, వొయ్యారంగా మంచంపై ఒకవైపు తిరిగి పడుకున్న భార్యను చూచాడు రఘు.

అయినా ? ముక్త భర్త రాకను గమనించనే లేదు,

'ముక్తా! ఏమిటీ వేళ ? ఎంతపిల్చినా పలక్కుండా ఎందులో ఇమర్స్ అయ్యావ్ ? ఏ ప్రహేళికవిప్పుతున్నావ్ ? వోహో! కథ చదువుతున్నావా ? పనిలేని ఆడవాళ్లకి ఇదో 'అబ్‌సెషన్' అన్నాడు రఘు.

'నేను చదువుతన్నది కథ కాదండీ! నడుస్తున్నచరిత్రను పూసగుచ్చి కథాహారంగా నా కందించిన మాచెల్లెలి వుత్తరం.'

'అయితే ఇంకేం ? కారణం బలీయంగానే వుంది నిన్ను నీవేమరిచేందుకు, ఆమాటల పిట్ట తెలంగాణపు పలుకు బడినంతా పొదగి సుతారంగ దండలల్లి గంపలకెత్తి పంపివుంటుంది, ఇక నీవాపుట్టికలను భద్రంగా మోసుకెళ్లి ఇంటింటి కోపువ్వంటు పంచకపోతావా? ఆసురభిళాన్ని వాసన చూపించకపోతావా ?

అంతటి పని చేసింది, చేసేది, నేనుకాదండీ ! మీరే ! 'తేనె పెరులవంటి తెలంగాణపు సిసలైన తెలుగు మాటతీపి చూడండీ 'అంటూ దాని కంచుగంట వంటి కంఠంతో టేపు చేసిన కథలను వినిపించింది మీరే కదూ ?

ఆప్రభావం ఇప్పుడు అమెరికా తెలుగు వారిపై కూడా పడింది. ఆ కతలు విన్న వాళ్లంతా 'మీమాటలు వుత్త పామరికం, అనాగరికం అనుకున్నామేగాని, ఆయాసలో ఇంతరుచీ, ఇన్ని సొగసులున్నాయా ? అంటూ చిత్ర పోతున్నారు.

ఆగు! ముక్తా ఆగు!'చిత్రపోవడం' అన్నది ఎంత సొగసైన పదబంధం ? ఇది నీ చెల్లెలి ప్రభావమా ? కాక స్వయం సృజనమా ? కా కేం జేస్తుంది?

అన్నీ ఆపాదరింటి పువ్వులేగా !

'ఆ( ఆవుత్తరమేదో ? కాస్త గట్టిగా చదువు నేనూ వింటాను ' అంటూ కుతుహలం చూపాడు రఘు. ముక్త చదవడం ప్రారంభించింది. ఆవుత్తరం ఇలా సాగింది.

'అక్కా ! నీవిప్పుడు కాపురం వుంటున్నది మన ఏడేడు లోకాల్లోఏ లోకమో ? తెలియదు. అయినా, అందరినీ ఆకర్షించే 'జాదూఘర్' లాంటి అమెరికా మహానగర సముదాయాల్లో అదీ వొకటని విన్నాను. అక్కడ మన తెలుగు వారు చాలామంది కాపురం వుంటున్నారనీ, అక్కడ మీరంతా, గుళ్లూ గోపురాలు కట్టుకుని ఎంతో కలిమిడిగా పండుగ పబ్బాల్లో వేడుకలు జరుపు కుంటున్నారని కూడా విన్నాను, నిజమే ! వస్తువు కరువైతె గాని విలువ తెలిసిరాదు.

ఈమాట ఎందుకంటున్నానంటే ? ఇక్కడ మన వాళ్లకు ఏ గాలిసోకిందో ? కానీ, రాను రాను మన భాష సంస్కృతుల పట్ల శ్రద్ధాసక్తులు సన్నగిలుతున్నాయి. అన్నిటికన్నా ప్రధానంగా రాజకీయాలు ములుసూపుతున్నాయి. అటు ఇటూ కాని త్రిశంకుస్వర్గాన్ని నిర్మించాలనుకుంటున్నారు. అదికూడా మాటల్తో చేతనయ్యే పనా ? అయినా పరుగులు మాత్రం తప్పడం లేదు.

అక్కా ! మొన్నటిదసరానాటి విషయం వ్రాస్తున్నాను.

నీకు తెల్సు గదా? మనవూళ్లో ఆడవారికి 'బత్కమ్మ' పండుగన్నా, మగవారికి దసరా అన్నా ఎంతో సంబరం అని, అది ఎంతో వేడుక. అందుకే ఈ పండుగను 'పూలపండుగనీ ''ఆటపాటల ' పండుగనీ 'కలెగల్సుల పండుగనీ' 'సింగిణేల పండుగనీ' 'పాలిమేరదాటు ' పండుగనీ, 'విజయప్రస్థానపువేళ అనీ, 'ఆయుధపూజోత్సం ' అనీ, 'అపరాజితాదేవికొల్పు ' అనీ,' ముగ్గురవమ్మలపండుగనీ, 'ఆదిశక్తి విశ్వరూప వైభవం ' అనీ సంభావిస్తూ ఎవరి తాహతులననుసరించి వారు వైయక్తికం గానే కాక సామూహికంగా వేడుక జరుపుకునేవారు. ఈసారీఅలానే జరిగింది కానీ దాని రంగూ రుచీ మారింది.

అక్కా ! బావ కూడా నీభుజాలపై నుండి వొంగి నిన్ను వొళ్లోకి తీసుకున్నంత పని చేస్తూ ఈ ఉత్తరాన్ని చదవుతాడనే సంగతి మరిచాను, సరే ! ఆయన మన్నిక, రుచి కోసం మన తెలంగాణపు భాషలోనే వ్రాస్తాను, చదువుకొమ్మను.

''అక్కా ! మనూరి పక్కనున్న కొండగట్టుకు ఈవలున్న వూరచెర్వు నీ కెర్కే గద? ఇంగ ఈత్యాప గుడ రివాజుపోంటి జమ్మికంట ఆడ్కె వోయిన్రు.

అట్లవోయిన నల్గురు 'సుబాకాంక్షలంట 'నాజూకు మాటలు వలుక్కుంట సేతులు సేతులు గల్పుకున్నరు.

ఇంగశనామంది ఎన్కటి మణుసులూ ఈకొత్తమాటసరిగ్గనోరుదిర్గనోళ్లు ఎన్కటి తీర్గనె వొగర్ని వొగరు కాగలిచ్చుకోని బంగారం బెట్టుకున్నరు, కడ్పునిండ నగి మురిసిన్రు.

అటెంక సోరసోర దుడ్డె గాళ్లంతరొండు జట్లై చెందాటగిన ఆడిన్రు. ఆట్ల ఆటలల్ల గెలిసి నోండ్లకు ఇనాములు వంచిన్రు.వూరి పెద్దలు.

అక్కా ! నీకు ఇంగో సంగతి అంటె ? బావ ఇనివిగిరిగంతేసెసంగతి, అదేనమ్మ ! ఈత్యాప మనూరికి 'సర్పంచ్ ' కాపులూ, కర్ణాలుగాకుండ అడ్కన వడ్డ బీరని కొడుకు రాజం అయిండు ఎర్కేనా?

రాజం సర్పంచ్ అవుడు నాకు గుడ ఇష్టమే ! అనొద్దుగని ఇంతనో అంతనో అక్షరం తెలివివున్నోడు. ఎర్తి బుద్దులు లేవు, ఏందో ? నేనే పెద్దనంట మిర్రెక్కి కూసోక, పెద్ద చిన్న అంట నయ బయాలతోటె మెదుల్తడు. అందుకని మనోండ్లు గుడ అరమరికలిడ్సి జత జతన గల్సి కల్మిడిగ గూసున్నరు. ఇదంత జూసి వుబ్బాగని మల్లి గాడు వుండవట్ట లేక సేతులు నల్పుకుంట నల్గట్ట నాదింత అంట 'అయ్యలూ ! ఈనాటి, ఈకలెగల్పుల ఇచిత్రం జూస్తుంటె ఇంగఎత్తు పల్లాలన్ని వుడ్గి అంత సమంగ అయ్యే దినం కనుసూపు మేరల్నెవున్నట్లనిపిస్తుండది' అంట ఎడ్మసెవి నుంచి కుడిసెవి దాంక పండ్లు ఇగిలిచ్చిండు.

''అఁ ఏంమంచో ? ఏం సమానమో ? యాడుండది మంచి ? ఎక్కడుండది సమం ?ఇవన్ని నూనె బుడ్డిమీది రాతలే. మాటలు కోటలు దాట్తయి గని సేతలు గీతలు దాటవ్. రాగిదుడ్డుంటె రాజు బిడ్డొస్తది- పైసనే అంత , అదే మంచి, అదే సమం, తతిమ్మదంత వుట్టిబ్రమ, మైదు,వో తమాసనాట్కం' అంట పుల్ల ఇర్సిండు ఆడున్న యాదయ్య.

ఈ మాటలన్ని నక్కపిల్లోలె ఇంటున్న కర్ణప్పంతులు అంటె తంటాలల్ల

తాకి ముగ్గి యెవ్వారంల కాకలు దీరిన ఎంకట్రావ్, కలుగ జేస్కోకుంట అపశకునమోలె ఇదేంమాట ? పండుగపూటల్ల లొల్లివుట్టగలదంట గొంతు జెర సవరిచ్చుకోని యాద య్యను జూసుకుంట -

'యాదయా ! నీవు, మరెంటె మరి కటీనంగ మాట్లాడుతుండవు. ఇప్పుడు పరీక్షల ముచ్చటే జూడరాదు ప్యాస్ అంటె నూటికి నూరు వొస్తెయిగిటనా ఏంది? అవ్వల్ దర్జకు అరువై, అటెంక ముప్పై అయిదు, వొస్తెకామ్యాబ్ గద? ఇగ అసోంటప్పుడు, ఎన్కటి పోలిక జూస్తె సింతాకు మందమన్న మనమంది బాగైన్రా ? లేదా? అంట జూడాలెగని, మొదటికే మొకం జిట్లిచ్చి గుండుసున్న అంటె ఎట్ల ? నల్గురికి మెప్పితం గావొద్దా?

ఇగజూడు తమ్మి ! ఇట్ల నాసేతిని జూడు ! ఈసేతికున్న ఐదేళ్ల ఒక్కతీరు, సమంగ వుండ యా ? మనచేతిఏళ్లే సమంగలేనప్పుడు ఇంత పెద్ద సంగంల ఎచ్చుతగ్గులు వుండొద్దంటె ఎట్ల ? ఆఁ ఎన్ని ఎత్తువొంపులు వున్నగని అన్నికలిసికట్టుగ వుండు డన్నదె నిజమైన పొందిక. నల్గురు ఒక్కకుత్కోలెనడుస్తెనె ఏ పనన్న సాపుగ సుకురంగ నడుస్తది...

అవును ! ముక్తా ! ఈపలుకుల చిలక ఇన్ని మిఠాయి పొట్లాలు ఎట్ల సంపా దించిందో ? అన్న రఘు మాట వినిపించుకోకండా 'ఇంకావినండి' అంటూ ముందుకు సాగింది ముక్త...

'నోరు లేనిజీవరాసులకు గుడ నడిపిచ్చె నాయకుడుంట ఒకడుంటడు, ఉండాలె. గని, ఒక్కటి ముట్కు గోరునుండి శికెదాంక బాగ పర్కాయించి చూసి ఆలోచన జేయాలె, మీరు ఎన్నుకునే పెబ్బ పురాగ గోడ మీది పిల్లి వాటపోడు గాకుండ నల్గురి మంచి సెబ్బరలు అర్సుకుంట, ముండ్ల బాటేది? పూలబాటేది అనేగురి దెల్సి అందర్ని నడిపిచ్చెటోడుగావాలె, అసోంటోణ్ణే ఎన్నుకోండి, అందికె చిన్నా పెద్ద అంట వుండాల్న న్నరు. లేకపోతె గొర్రె దాటు కత ఐతది' అంట మంగళం బాడిండు.

ఇంతట్లకె పెత్తందారు తనంల వొడ్పు వొంపులు దెల్శిన కర్రెతిమ్మరెడ్డి అందు కోని ఆఁ మీరు నూరనుండి, ఆరనుండి, మంచిసెడ్డలనేవి ''జీవికి పుట్టుకల్నె పుట్టు కొచ్చె జీవ లక్షిణాలు, ఇవి తల్లికడుప్పుల పిండం ముద్దగట్టినప్పుడె జీవకణాలల్ల గల్సి బిడ్డ

ఎంటనె కలిసి వొస్తవిగని వేర్వుగ పైన వెట్టుకున్న సొమ్ములో లెగావు. ఈగుణాలు గోకిపారే సెటందుకు.

ఈదినాలల్ల గుత్పసేతవట్టినోణిదెరాజ్జెం. సిన్నశాపనుజూస్తె పెద్దచాపకు నోరూరక తప్పదు. ఇట్లసృష్టిలనెపొదిగివుండదిఅసలుకరామతు. అయినగని నోరులేని పసురమైన వోకట్టుబాటు ఎంట నడుస్తది. ఇదే సమతూకం, ఆ సమతూకం చెడ్డనాడు యాది నిలువదు. అందుకె ఎప్పటికప్పుడు ఏరుతారుగాకుండ శిగెలు కత్తెర్ల వడ్తనె వుంట యి. అట్లె మనసంగంలగుడ సమతూకం వుండాలె. అట్ల వుండెటందుకె 'మంచి చెడ్డ' 'చిన్న పెద్ద ' అనే కట్టువాటు నడుస్తది, నడువాలె, అన్నడు.

ఈ మాటలన్ని ఇంటున్న వో హరికత బాపనయ్య నడుంగల కలుగజేస్కోని ''సూడుండి పెద్దమణుసులు !ఎందుకన్న మంచిది; బూమివాటంజూసినీళ్ల వారిచ్చుండి, గని, ఆపారేనీళ్ల యావంకకు, యాదిక్కుకు వారుతుండవో ? సూడుండి. ఆఁ అవి ఎవరి సొపకింది కన్నవోని మాకేంది? మేం ముద్దుగ ఎత్తు మీదుండం అంట అనుకోకుండి.

నీటిలక్షిణం జెప్పలేం. వాటంజూస్కోని ఆనీళ్ల ఎటుదిక్కు మళ్లతయో, ఎటు వార్తయో ? తిక్కదిర్గి నీసొపకిందికే రావచ్చు, నిన్నులేపొచ్చు ? అప్పుడే మంట మిడ్కుతవ్ ? అందికే ఎవ్వముందు ఆలోచన చేయాలె. వుత్తమాటలెగద ! అవి గాలిల గలుస్తయి అంట అనుకోగూడదు.

మనం మాట్లాడిన మాటలన్ని ఆకాశాన అంటె మొగులు మీద శబ్దబ్రహ్మయ్య కాడవుంటవి. అట్లలేకపోతె ఈయాళ్లగిరేడియో, టి.వి. గీవి ఎట్లొస్తుండె ?యాదో మాట్లాడి పొద్దుగడ్సెనంట సేతలు దుల్పుకోకుండి ! అంట పత్తెం జెప్పిండు.

కామ్యకవనంలద్రౌపదమ్మ తప్పాలకు అంటుకున్న మొత్కుతీర్గ యింకా యాణ్నో కొంచెమంత మంచితనం తనండ్లమిగిలిచ్చుకున్న రామయ్య ఇదంతయిని ఉండవట్టలేక 'అయ్యలూ ! ఈయాళ్ల అందరు వొకటే పాట . రోటి పాటతీర్గ తెల్సినాతెల్వకున్న మనం మారాలె ముందుకు పోవాలె, వుర్కాలె అంటుండరు, ఇంగోటి మనోండ్లందరికి సదవు రావాలె అంటుండరు. నాకు మెప్పితమె ! అంతకన్న బాగ్గెం యాడుండది ? గని అక్షిరం రాస్కం మట్కె సదువంటె నే నొప్పను. సదువు మనిషికి ఎలుగుజూపే కన్నసొంటిది.

కన్నొచ్చినంక గుడ్డినడ్క నడుస్తనంటె ఏంలాబం?

నడుమంత్రం సిరితీర్గ ఈ నడుమంత్రపు సదువులొచ్చి అంటెసీనిమ్మబోరట్ల మీదపేర్లు సదివ నేర్సి మిన్నూ మన్నుగానకుండ ఐన్రు. ఓనమాలు సరిగ మిడ్కరానోడు గుడ నేనెందుకు నాయకుడ్నై ఎత్తుకుర్సి ఎక్కగూడదు ? అప్సర్ అయ్యి ఆరాంగ కాలుమీద కాలేస్క హుకూమత్ చేయగూడదు? అంటుండడు అంట మొదలు వెట్టంగనె .....

మొగిలన్న అందుకోని -''రామయ్యపంతులూ ! మీరు వొప్పన్న ! తప్పన్న ,ఛా అన్న, సీ అన్న, బళా ! అన్నగని ఈఅక్షిరం తెల్విడితోటి జనానికి కనువిప్పు కలిగిన మాట మటుకు నిజం. అక్షిరం తెల్వి ఎంటనె రొండెర్గనోళ్లకు యాదొ జెరజెర పాలు, నీళ్ల అంతురం దెల్సుకొనె, యిజ్ఞానం వొస్తుండది. వూరిమీది ముచ్చెట్ల ఎర్కకుదురు తుండది. మరీ రొండుకాళ్ల పసురాలోలె గాకుండ, ఆడీమొగ ఇద్దరు సొంత బుద్ధిమీద నడ్సుకం నేర్సుకుంటుండరు ' అంట తనఎదలపొరలు ఇప్పిండు.

ఇంతట్లకె అందత్కల బుద్ది ఎంకటేశం అందుకోని తానుగుడ పెద్దమనిషిలెక్కన జమగావల్నంట అక్కడిక్కడ జూసి న్యాల సూపులు జూస్కుంట ''ఏందొనయ్య ఈ నడ్మ ఎండకాలం వానాకాలం సదువులే ఎక్కువైనయి. పేరుకే సదువులుగని, పుడ్తున్నయి జూస్తె పుట్టగొడ్గులోలె సెదలపుట్టోలె వున్న సంగాలె మిక్కుటమైనయి. చెప్పెటోనికి యినెటోడు లోకువ అంట లేసినోడు లేవనోడు అంత లీడరీ జేస్కుంట కొత్త గురువులయ్యి లోలె పాతబూజులు దల్పుతం '' అంట దిర్గుతుండరు. ఏందో? కొత్త పాతల మూలం దెల్సినట్ల !

గుండ్లదేలి బెండ్లు మునిగె కాలమయ్యా, చిత్రాలు గురుస్తుండవి. యాడ జూసిన వూళ్ళ ఈనినట్ల లెక్కపత్రంలేకుండ తోసుకుంట, దొబ్బుకుంట నడుస్తుండరు ! బంగారు బాట జూపేవి గాకుండ !ఈ కంచు గంటల లొల్లి ఎక్కువైంది '' అంట, కుశాలుగ జెప్పుక పోతుంటె, కొత్తంగ యిప్పుడిప్పుడె పట్నం బోయి బత్కదెర్వే నేర్సిండో బాలే వెంచిండొ గని బుజాల తోటి సయ్యాటలాడే జునుపాలు వెంచిన ఎల్లిపాయె పటాకి ఏసుదాసు దొర్క వట్టుకోని .--

''అవునవును సూస్తనెవుండము అందరికి శకునాలు వల్కిన బల్లితాను వోయి అంబటికుండల వడ్డదంట, ఏంశముత్కారమయ్య ? ఎదుటోనికి తిర్పెపుసిప్ప

అందియ్య అందరు వేమన్నలే! కడ్పుల ఇసం నాల్కెన బెల్లం! తమకు పట్టని నీతుల ముచ్చెలు ఇడ్సి పంచ అందరు సిద్ధమె! అందరినోట్ల నానేది ప్యాదోడె!

నారాయణనుండి నాదాక, ఎచ్చెమ్మనుండి ఏబ్రాసిదాంక, బీమన్ననుండి ఏక్తారు గాణి దాంక, రంగారినుండిరామానుజందాంక అందరు వొక్కటే పదం ఆసదం ఎంట తందాన కాండ్లు, అమ్మో! ఇసొంటి బయిరూపులోళ్లను నమ్మితె చెడక బత్కిందెవరుసెప్పు? అయిర్ని, బయిర్ని, బయిర్ని బత్తల జేసె ఘటాలు అంట, టపా, టపా, జాడిస్తుంటె....

ఈనడుంగల నాట్కల్ల ఏశంగడ్తున్న కపుటవాది కిష్టయ్య, తమాసగ వోదిక్కు కన్నూ, ముక్కు కదిలిచ్చు కుంట ఆదిక్కు పండ్లు మట్కె కండ్ల వడేటట్ల నగుకుంట మునిపండ్ల తోటి బీడి కొనగొర్కి ...

''అయ్యా! సబలు, సంగాలంట, ఏందో బర్వుగ మొగులుకు ఎత్తుకుంట మాట్లాడు తుండరు? ఇవిటితంతూతడాక ఎవరికి దెల్వదయ్యో? ఈసేతిమీద ఎన్నెన్ని సబలు జరిపిచ్చిన? ఎందరు అయ్యగారోళ్లు యిస్టేజి ఎక్కి నోరు దిర్గని మాటలల్ల వుపన్యాసం దంచీ, దంచి ముప్పూటల సాయిత్యం, రానువోను కిరాయిలకంట పిడికెడు నోట్లు సేజిక్కిచ్చుక పోలేదు?

ఏందో పట్నాల కెళ్లి పెద్ద పెద్ద బిరుదు మొగలొచ్చిన్రు రొండు మంచిమాటలు సెవులేసుకుందమంట ఆడ జమైన మందికి సెవులున్నగని అడ్డగోడటివెట్టినట్లె? యాది దెల్సిందని? వొచ్చిన పాపానికి ముండ్లమీదగూసున్నట్ల గూసుండి వాలంటీర్లు యిషార జేసినప్పు డల్ల సప్పట్లు మట్కటిన్ను డబ్బులల్ల సేర్లేసి కాల్సినట్ల టపా టప మోగిచ్చిన్రు పాపం!

ఇంగ ఆర్సమైన జెట్టీలసొంటోళ్లు సబలపేర్న నల్లది, తెల్లది కలెవోసి ఈ తలుగొట్టిన్రు. గిట్లే ఎన్ని నాట్కం సమాజాలు? ఎందరెందరు మిటారి కత్తెలు? ఏం ఆట? ఏం పాట? అబ్బధూం తడాక! ఇదంతవుత్తలొల్లె! నురుగుబుగ్గ బూమ్మీద నిలవడ్డంత సేపన్న ఆగవు. ఇసొంటి ఈ సబలకు ఇంత పీకులాట ఎందుకు? అంట? వోరసెలివితోటి నగె ఇసపునగు సెడకుండ బదినికెను దక్కిచ్చుకున్న సన్యాసి మొకం బెట్టిండు.

గాలిపూరాలసొంటి ఆఈమాటలు ఇన్నంకదైర్నం దెచ్చుకోని ముక్కుసూటిగ నడ్సె నాగయ్య మొకవాటం ఇడ్సి సూటిగ జూస్కుంట ..

''ఇందాకటినుండి మీమాటలన్నిఇంటనెవుండగని, ''అంగట్ల అబ్బా అంటె ఎక్క డోడవు ? బిడ్డా'' అన్నట్ల నాట్కంల బొమ్మలను నిజం అంట నమ్మిక వడ్తారయ్యా? ఆఁ మీరేందా ?''కొండలుదోగి తొండలు వట్టి ''నట్ల గడ్డిపర్కలను గడ్డపారల జేయవడ్తిరి ? ఇవన్ని వుత్తకాయితపు పులులె ! వుత్త పుట్టగొడుగులు , వానగండ్లు,వానగుర్రాలు, యివెంత ? ఇవిటిబరువెంత ? బత్కెంత ? యాదన్న లెక్కలకు దీస్కోని యిలువలు గట్టె టందుకు ? ఇవేం కాస్తయా? పూస్తయ, నిల్వనీడనిస్తయ ? కనికష్టమఃంట కసన్నపూడ్వ పనికొస్తయ? వానగండ్లు ఇవన్ని సూపుడు గుర్రాలాయె గని అవిపూడ్కెక ? పునాదిక ? కంకరక? గోడక? గోటీలక ? ఎందుకు పనికిరాని పాత సిబ్బికన్న దండుగ. నీళ్లమీద తట తట మంట శ్యాపఅడ్డునిల్శినంతసేపు నిలవడవు. వానకాలపు వుసిళ్లతీర్గ ఎన్నిసబలు పుట్టు కొస్తేంది ? ఎన్ని సంగాలు ఎలిస్తె ఏంది ?

నరంలేని నాల్కెకు తాళమా ? తలుగా ? ఎటుదిప్పితె అటే ! శుద్దీ బద్ది ఎందు కంట ? కూసిందేకూత, ఏసిందే ఏటు ! అంతె ! ఈపొద్దు రేపటి సబలు, సంగా లంటె నాకు కుదిరిన నిర్ణాయకం 'ఇది అన్నడు.

నాగన్నగొంతులగొంతుగల్పుకుంట శోబనాద్రి లాజిగతకిరీరు జేస్తున్నట్ల మాట్లాడుకుంట ''అవునయ్యా ! ఈసాయిత్తెపు సబలు- సంగాలు ఎందుకంట? సూస్క ముర్వ, సెప్పుక ఏడ్వ ? ఇందుట్ల ఎంత మంది ? గుండెదిటువు, బుద్ది పదునులుండి తోటోణి మంచి గోరె టోండ్లు ? అంగిట బెల్లం- ఆత్మనయిసం నింపుకోని ఎప్పుడు ఇంగోళ్లచిద్రాలె ఎత్కుతరు '' అంటున్న శోబనాద్రి మాటను సాగనియ్యకుండ నడుంగల్నె తెగనర్కి రామచారి .....

''ఆఁ మరీ అంత అన్యాయంజేయకు శోబనాద్రి ! తెల్సీ తెల్వక జోరుగ తూర్పార వడ్తనంటె గాలిగిన అడ్డం దిర్గిందంటె ఆపొల్లు మనమొకాన్నె వడ్తది. అందికె బద్దరం. నోరుజారిన మాట, సింగిణిడ్సిన బాణం మళ్లరావు' నీళ్లలోతు ఈతగాణికి దెల్సు. దేవుని గుట్టు పూజారికి దెల్సు ' అంట అసలు లోతుపాతులు నాకెర్క. ఎందుకంటె అందుట్ల మూడుమున్నలు మునిగిమీదికిలేసినోణ్ణే !

బాగ యాదికి వుంచుకొ, ఎప్పుడన్నగని నీళ్లబింకంజూస్కొనె కప్పలు, చాపలు చేర్తయి, పచ్చ గడ్డిల్నెమిడ్తలు ఆడ్తయి. నాకుదెల్సినంతవుట్టుకు ఇప్పటిపార్టీలల్ల అసలోండ్ల కంటె అంగడి గాండ్ల లొల్లె ఎక్కువగానొస్తంది. ఆంత భజనపర్లు తందాన గాండ్లు, అరువు బత్తెపోండ్లు, నిత్తెపుగాసగాండ్లు, కైకిలికవులు, తిర్పెపుజోగులు, బూతు గాండ్లు, నూనెనాగన్నలు, రొండు మూతులపాములు, వుప్పేసిపొత్తుగల్సెటోండ్లెనయిరి నమ్మికపు బంట్లు గన్కనా ? ప్రాణాలొడ్డి నిల్సెటందుకు ? ఆపతియాళ్ల ఆదుకునేటం దుకు అసలుయాళ్లకు తోకనాం పీకనాం?

అందికె ఎదురు బదురు నిలవడి సూటిగతుపాకి ఏసెటోణ్ణే నమ్మొచ్చు గని ఈపు పోటు గాండ్లను, తడిబట్టలతోటికుత్కెలు గొసెటోళ్లను నమ్మతరంగాదు. అమ్మో ! వీండ్లంత లింగాలను మింగె జంగమయ్యలు '' అంటదండుకం జదివి సట్కున ఎవరో ? బిసదిప్పి నట్ల గప్పుగైండు.

రామచారి మాట్లాడినంక అందరు వోగడిసేపు గప్పుగై ఆలోచన్ల వడ్డరు. గని వాళ్ల ఆలోచనన్ల యాడికోమళ్లి పందిళ్ల వారకతొలిగనె, అందరి ధ్యాస మళ్లిచ్చుకుంట.

ఈ దినంల నమ్మికనె కరువైంది. యాదినిజం, యాది అవద్దం, అంట దెల్సుకు నుడే గగునమైంది. ఈపొద్దురేపంత బూట్కమె ! ఇసొంటి కపుట వాదుల ముండ్ల మాటలు యిని ముర్కుల గూలెకన్న, జోలెవట్టుక జోగిఐంది నయం. పక్కదుల్పుక లేసిన కాణ్ణుండి న్యాయం, దర్మం అంట పాటవాడుకుంట బత్కెటోణి బాటన కంప గొట్టి పిడ్కలకుచ్చెనోలె పాపాన్ని పోగుజేసుకునుడేపని, అంట ఆడగూసున్న ఇద్దరు ముగ్గురు పెద్దమణుసులకు సూటివెట్టి, బర్సెలేకుండనె పాడ్సినట్ల మాట్లాడిండు.

ఇదంతజూసి, అయ్యొ ! ఇదేంకత ? నగులు వోయ తెగుల య్యెటట్లుండది అంట, ఆడున్నోళ్లల్ల వోచాకు అసొంటి పోరడు లేసి ''ఏందే ? పెద్దమణుసులు ? ఎంత సేపటికి మీజోలిమీదేనా ? మాపోరగాండ్లను వట్టిచ్చుకోరా ? ఎట్ల ? ఎంతోసేపాయె ? ఇంటిమొకం బట్టె పొద్దుగూడ ఐతుండది. మాసిన్నోళ్ల తోటి బంగారం ముట్ట జెప్పిచ్చుకోని దీవెనార్తి ఇయ్యరా? రాంగనె బంగారం బెడ్డమంటె ? మేమే మొ ఆటలల్ల వుద్దీలు గట్టివుంటిమి, అటెంక ఇప్పుడు మీరేమొ ! వూరి మీది ముచ్చట్లన్ని ముంగలేస్క కూసుంటిరి ?

ఇంగనన్న దీసుకోండి జమ్మి అంట జేబులకెళ్లిదీసి అందరికి వెట్టుకం మొదలు వెట్టిండు. ఇంగ ఇట్ల ఆపిలగాణి చముత్కారంతోటి అందరి నోటికి తాళం ఏసినట్ల జేసి జతగాళ్లను గుడ లేపి, నగుకుంట ముర్సుకుంట జమ్మి వెట్టిచ్చుండు.

పిల్లలందరు అణిగిమణిగి వొంగొంగి పెద్దోండ్ల కాళ్లకు దండాలు వెట్టంగ వాండ్లు సంబురంగ 'నాయినలూ ! మీరంత విద్దెబుద్దులు ముద్దుగ నేర్సి, పుట్టిన గడ్డను, కన్న తల్లిని ,తల్లినిమించిన దేశాన్ని మరువకుండ మంచి పేరుదేండి. నిండ నూరేండ్లు ఎళ్ల బత్కుండి అంట దీవిచ్చిన్రు.

అక్కా ! ఇదీ కత. మరి బావ ఏవంటడో ? గని జరిగిన ముచ్చెట యిది. మనూళ్ల మొన్నటి 'దసుర 'నడ్సిన తీరు ఇది . అంటూ వుత్తరం ముగించింది ముక్త.

'ముక్తా ! మీచెల్లెలు పుట్టి నేర్చిందా? పుట్టక నేర్చిందా? ఈమాట సొగుసూ, ఈరీతి రివాజులన్నీ తలనెర్చిన తాతమ్మలా రాసింది .? మాఅమ్మ తోడుపెట్టిన మీగడ పెరుగు తిన్నట్లుగా వుంది. ఇప్పుడు అదే .. నీ అధరామృతం ఆనినట్లుగావుంది ' అంటూ రసరమ్యంగా ప్రవర్తించాడు. పగలే వెన్నెల కురిసింది.